క్లుప్తంగా

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



దుత్తలూరు: దుత్తలూరు గ్రామంలోని ఊరకొండపై వెలసిన రామ లింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలను సోమవారం నిర్వహించారు. స్వామివారిని పంచామృతాలతో అభిషేకించి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



సంగం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీఓలను తిరిగి సొంత మండలాలకు కేటాయించారు. ఈ క్రమంలో సంగం ఎంపీడీఓగా గోపీ బాధ్యతలను సోమవారం స్వీకరించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

గ్రీవెన్స్‌డేకు అధికారుల డుమ్మా

వింజమూరు(ఉదయగిరి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేకు పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ఉదయం 11 గంటల వరకు సైతం మూడు, నాలుగు శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బందే హాజరయ్యారు. మండలంలోని వివిధ సమస్యలపై వినతిపత్రాలను పలువురు అందజేశారు.

వాల్మీకి బోయలను ఎస్టీలోకి మార్చాలని వినతి



వినతిపత్రమిస్తున్న నేతలు

వరికుంటపాడు: వాల్మీకి బోయలను ఎస్టీలోకి మార్చాలని మండలంలోని పలువురు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్‌కు వినతిపత్రాన్ని సోమవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. 1956కు ముందు వరకు ఎస్టీ జాబితాలోనే ఉండేవారమని, అయితే కొన్ని కారణాలతో బీసీల్లో కలిపారని చెప్పారు. తిరిగి ఎస్టీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని కోరారు.

ఉపాధ్యాయుడి కుటుంబీకులకు పరామర్శ

కలిగిరి: చీమలవారిపాళెం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఉపాధ్యాయుడు గంగవరపు వెంకటరమణయ్య కుటుంబసభ్యులకు రూ.1.25 లక్షల ఆర్థిక సాయాన్ని యూటీఎఫ్ నేతలు సోమవారం అందజేశారు. ఆయన స్వగ్రామం జమ్మవరానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం రమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. యూటీఎఫ్ జిల్లా నేతలు నాగిరెడ్డి, జమీర్ అహ్మద్, మల్లికార్జున, మండల నేతలు నాగార్జున, వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, షంషుద్దీన్, ఖాజారహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే

వరికుంటపాడు: ప్రజా సమస్యలపై స్థానిక బీజేపీ మండల కార్యాలయంలో అర్జీలను సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా వినతిపత్రాలను పలువురు అందజేశారు. పార్టీ మండలాధ్యక్షుడు ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ మాళెం వంశీధర్‌రెడ్డి, సెక్రటరీ అరుణరెడ్డి, బీజేవైఎం జనరల్ సెక్రటరీ హరీష్ కిసాన్ మోర్చా వెంగళ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటు కౌన్సెలింగ్ బహిష్కరణ

ఉదయగిరి: మండలంలో సోమవారం నిర్వహించిన టీచర్ల సర్దుబాటు కౌన్సెలింగ్‌ను ఉపాధ్యాయులు బహిష్కరించారు. అనంతరం ఎంఈఓ తోట శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని ఫ్యాప్టో నేతలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉందని, ఉపాధ్యాయ సంఘాలు సూచించిన ఏ అంశాన్నీ పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని దుయ్యబట్టారు. నేతలు దస్తగిరి అహ్మద్, ఖాజా, రామిరెడ్డి, ఫణిరాజ్, నల్లబోతుల రామకృష్ణ, రియాజ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన భూమిని ఆక్రమించారు..

మర్రిపాడు: బూదవాడ పంచాయతీ కృష్ణాపురం బీసీ కాలనీలోని సర్వే నంబర్ 207 / 1లో గల శ్మశానభూమిని కొందరు ఆక్రమించి ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారని, దీనిపై చర్యలు చేపట్టాలని పలువురు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ స్వప్నకు వినతిపత్రమిచ్చారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి



వరికుంటపాడు: మహనీయుల చిత్రపటానికి నివాళులు



సంగంలో..



సీతారామపురంలో..



ఉదయగిరిలో..

వరికుంటపాడు: పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి గానూ మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ తోట వెంకటకృష్ణకుమారి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. పంచాయతీల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని కోరారు. అనంతరం జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని కోరారు. తొలుత గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలిగిరి: గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు తెలిపారు. కలిగిరిలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ వెలుగోటి మధు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక స్త్రీ శక్తి భవనంలో నిర్వహించారు. ఎంపీడీఓ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం: చెత్తతో సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆర్థిక వనరులను పెంపొందించేందుకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శేషసాయి కోరారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఓపీఆర్డీ నారాయణ, విశ్రాంత పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: గ్రామాభివృద్ధి, పారిశుధ్య నిర్వహణపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈఓపీఆర్డీ భార్గవిరెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎల్పీఓ నారాయణ మాట్లాడారు. గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, చెత్తసేకరణ తదితరాలను వివరించారు. ఎంపీడీఓ గోపీ, ఈఓపీఆర్డీ అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రూరల్: పంచాయతీల్లో చేపట్టే పారిశుధ్య కార్యక్రమాలకు సర్పంచ్‌లు తొలి ప్రాధాన్యమివ్వాలని ఏఓ శ్రీనివాసులు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు శ్రీనివాసులు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



కలిగిరిలో..



ఆత్మకూరులో..

వెంకయ్యస్వామికి పల్లకిసేవ

చేజర్ల: ఆరాధనోత్సవాలను పురస్కరించుకొని నాగులవెల్లటూరులో కొలువైన భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో అభిషేకాలు, పూజలను సోమవారం నిర్వహించారు. పల్లకిసేవ, గ్రామోత్సవాన్ని వేడుకగా జరిపారు. ఆలయ చైర్మన్ కేశవచౌదరి పర్యవేక్షించారు.

89 మందికి అడల్ట్ బీసీజీ టీకాలు



వరికుంటపాడు: మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో 89 మంది వయోజనులకు అడల్ట్ బీసీజీ టీకాలను వైద్య సిబ్బంది సోమవారం వేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి కరిష్మా మాట్లాడారు. మండలంలోని వయోజనులు టీకాలను తప్పక వేయించుకోవాలని సూచించారు. మండలంలోని తూర్పు బోయమడుగులలో కార్యక్రమాన్ని సీహెచ్ఓ రాజశేఖర్‌రాజు పరిశీలించారు.

నిత్యావసర సరుకుల అందజేత



కావలి: డీఆర్ గొప్ప మానవతావాది అని కావలి మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ కిరణ్ పేర్కొన్నారు. వెంగళరావునగర్‌లోని కార్యాలయంలో 60 మంది నిరుపేద వృద్ధులకు బియ్యం, నిత్యావసర సరుకులు, నగదును డీఆర్ విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. డీఆర్ మార్గంలో కళాశాలలు, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వినయ్‌కుమార్‌రెడ్డి, విద్యాధర్‌కుమార్‌రెడ్డికి అభినందనలను తెలియజేశారు. జేబీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ మాల్యాద్రి తన భార్య అపర్ణ జయంతిని పురస్కరించుకొని వృద్ధులకు భోజనాలను అందజేశారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, సేవా సమితి చైర్‌పర్సన్ దొడ్ల లక్ష్మి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, జవహర్ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యంనాయుడు, తరుణ్, పావని, సేవా సమితి సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్, రంగనాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కలిగిరి: వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి గీతారెడ్డి తెలిపారు. కృష్ణారెడ్డిపాళెంలో 104 వాహనం ద్వారా వైద్యసేవలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు.

రైతు సేవా కేంద్రంలో ఏడీఏ పరిశీలన



కియోస్క్‌ను పరిశీలిస్తున్న చెన్నారెడ్డి

దుత్తలూరు: మండలంలోని లక్ష్మీపురంలో గల రైతు సేవా కేంద్రాన్ని ఉదయగిరి సహాయ వ్యవసాయ సంచాలకుడు చెన్నారెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కియోస్క్ ద్వారా విత్తనాలు, ఎరువుల ఇండెంట్‌ను పెడుతున్నామని చెప్పారు. రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని వీఏఏలకు సూచించారు. రైతులకు అవసరమైన డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేస్తున్నారని తెలిపారు. మండల వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి, వీఏఏ అంకిత పాల్గొన్నారు.

డీసీసీబీ శాఖలో తనిఖీలు



కారు లోన్ పత్రాలను అందజేస్తున్న శ్రీనివాసరావు

అనుమసముద్రంపేట: మండల కేంద్రంలోని డీసీసీబీ శాఖను జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన రుణాలను అర్హులకు మంజూరు చేయాలని సూచించారు. ఏఎస్‌పేట శాఖలో కారు లోన్‌ను మంజూరు చేశామని వివరించారు. బ్యాంక్‌లో రూ.15 లక్షలు డిపాజిట్ చేసిన వారికి అధిక వడ్డీని ఇస్తున్నామని వెల్లడించారు. కర్షక్ మిత్ర, ప్రధానమంత్రి విశ్వకర్మ, పీఎం సూర్యఘర్ యోజన తదితరాలపై అవగాహన కల్పించారు. అనంతరం రాజవోలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

మృతుల కుటుంబీకులకు చేయూత



ఆత్మకూరు: పట్టణంలో ఇటీవల ముగ్గురు మృతి చెందడంతో వారి కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని ఆత్మకూరుకు చెందిన సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. ఆయా కుటుంబాలకు రూ.పది వేల చొప్పున చెక్కులను ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి ఇచ్చారు. ట్రస్ట్ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



ఆత్మకూరు: ఇటీవల జరిగిన ఆటో ప్రమాదంలో పట్టణ పరిధిలోని 17వ వార్డుకు చెందిన షర్మిలకు ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి నెలకొనడంతో విషయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, ఎస్వీ ప్రజా వైద్యశాల ఎండీ డాక్టర్ ప్రణీత్ దృష్టికి స్థానిక యువకులు తీసుకెళ్లారు. ఈ తరుణంలో బాధితురాలి కుటుంబసభ్యులకు రూ.పది వేల ఆర్థిక సాయాన్ని వింజం దొరసానమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేశారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ వెంకటసందీప్, డాక్టర్ కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

ఆత్మకూరు: దేపూరు నుంచి ఆత్మకూరుకు వస్తున్న ఇసుక టిప్పర్‌ను ఆత్మకూరు ఎస్సై ముత్యాలరావు సోమవారం రాత్రి పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎలాంటి అనుమతుల్లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండటంతో టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

తహసీల్దార్‌కు శుభాకాంక్షలు

ఆత్మకూరు రూరల్: స్థానిక తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సుధీర్‌ను పలు రాజకీయ పార్టీల నేతలు కలిసి శుభాకాంక్షలను సోమవారం తెలియజేశారు. పట్టణానికి చెందిన చల్లా రవికుమార్‌రెడ్డి, మాదాల శ్రీనివాసులు, కొత్తపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

- ఎంపీడీఓగా ఐజాక్ ప్రవీణ్ బాధ్యతలను స్వీకరించారు. ఆయన బాధ్యతలు స్వీకరించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రెవెన్యూలో విలీనం చేయరూ..

ఉదయగిరి: మండలంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్ – 2 వీఆర్వోలను రెవెన్యూ శాఖలో విలీనం చేయాలని సచివాలయ వీఆర్వోలు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సుభద్రకు వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. వీఆర్వోలు అంజద్, వెంకట్, అనూష, దయానాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

- తహసీల్దార్ సుభద్రను మండలంలోని చౌకదుకాణాల డీలర్లు సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ఎస్సార్ రంగనాథన్‌కు ఘన నివాళి

సోమశిల: గ్రంథాలయ పితామహుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎస్సార్ రంగనాథన్ జయంతిని స్థానిక టీజేఎన్నెమ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో అనంతసాగరం గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న, లైబ్రేరియన్ నారాయణరావు, స్థానిక బీసీ బాలుర వసతి గృహ సంక్షేమాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధి పనిదినాలను పెంచాలి

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో ఉపాధి పనులు మందకొడిగా సాగుతున్నాయని, ఈ తరుణంలో కూలీలకు అవగాహన పెంచి పనులకు ఎక్కువ మంది వచ్చేలా చర్యలు చేపట్టాలని ఏపీడీ గాయత్రీదేవి సూచించారు. వింజమూరులోని జాతీయ ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కూలీలకు గరిష్ఠ వేతనం అందేలా పనులు చేయించాలని చెప్పారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు కేటాయించిన పండ్ల తోటల పెంపక లక్ష్యాన్నీ పెంచాలని సూచించారు. అనంతరం వింజమూరు గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉదయం ఆరు నుంచి 11 వరకు పనిచేయాలని చెప్పారు.

జామాయిల్ నరికివేతకు అనుమతులు తప్పనిసరి

ఉదయగిరి: మండలంలోని రైతులు తమ పొలాల్లో సాగుచేసుకున్న జామాయిల్‌ను నరికేందుకు రెవెన్యూ నుంచి అనుమతులను విధిగా పొందాలని తహసీల్దార్ సుభద్ర పేర్కొన్నారు. ఈ మేరకు తన కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడారు. రైతులు తమకు సంబంధించిన అసైన్డ్, సెటిల్‌మెంట్ భూముల్లో జామాయిల్‌ను సాగుచేసి పక్వానికి వచ్చాక, నరికి విక్రయించేందుకు గానూ సంబంధిత వీఆర్వోకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనంతరం ఆ భూములను పరిశీలించి రైతులకు చెంది ఉంటే నరికివేతకు అనుమతిస్తామని వివరించారు. మండలంలోని ప్రభుత్వ భూముల్లో గల జామాయిల్ చెట్లను కొందరు గుట్టుచప్పుడు కాకుండా నరికి అక్రమంగా రవాణా చేస్తున్నారనే అంశంపై ఫిర్యాదులొస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

ఉపాధ్యాయ సంఘాల సలహాలు తీసుకోవాలి

సీతారామపురం: పాఠశాల విద్య సర్దుబాటు ప్రక్రియకు ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఫ్యాప్టో నేతలు కోరారు. ఈ మేరకు ఎంఈఓ మస్తాన్‌వలీకి వినతిపత్రాన్ని అందజేశారు. యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ – 1938 ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, మహేష్, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం..



నిరసన తెలుపుతున్న రైల్వే కార్మికులు

బిట్రగుంట: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బిట్రగుంట రైల్వే ప్రాంగణంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ నాయకులు ఎంవీ శేఖర్, సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 18 నెలల డీఏ బకాయిలు విడుదల చేయాలని, ఎన్‌పీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానం కొనసాగించాలని కోరారు. అదే విధంగా 8వ వేతన సంఘం ఏర్పాటు చేసి జనవరి 2026 నుంచి వేతన సవరణ చేయాలన్నారు. రైల్వేలో ఖాళీలు భర్తీ చేయడంతోపాటు మహిళా ఉద్యోగులకు ట్రాక్‌మెన్, రన్నింగ్ డిపార్ట్‌మెంట్ విధుల నుంచి మినహాయింపునివ్వాలన్నారు. ఎనిమిది గంటల పని విధానం అమలు చేయడం, లోకో పైలట్‌లకు వారాంతపు విశ్రాంతి 46 గంటలు విధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అందరికీ 25 శాతం హెచ్‌ఆర్ఏ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు మైకేల్, మధు, రఘు, శ్రీహరి, క్రాంతి, మాధవ, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై మరమ్మతు పనులు

సాక్షి ఎఫెక్ట్..



ఆత్మకూరు రూరల్: మండలంలోని గొల్లపల్లి సమీపంలో బొగ్గేరుపై నిర్మించిన వంతెనపై పలు చోట్ల జాయింట్ల వద్ద రబ్బర్, ఇనుము, కాంక్రీట్ దెబ్బతిన్న విషయమై సాక్షిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. వంతెనపై జాయింట్లను సరిచేసి కాంక్రీట్‌తో మరమ్మతులను రోడ్డు నిర్వహణ కాంట్రాక్టర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు.

కొవ్వొత్తులతో ర్యాలీ



సంగం: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ సంగం బస్టాండ్ సెంటర్‌లో కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీని హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. హిందువుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ ప్లకార్డులను చేతపట్టి నినాదాలు చేశారు. అనంతరం మానవహారాన్ని నిర్వహించారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బిట్రగుంట: బోగోలు మండలం ముంగమూరులో గ్రామదేవత పోలేరమ్మ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన బండలాగుడు పోటీలు, ఒంగోలు జాతి ఎద్దుల ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఔత్సాహికులు తమ ఎద్దులతో తరలివచ్చారు. పోటీలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం



కావలి: పట్టణంలోని డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు మాట్లాడారు. డిజిటల్ ఆవిష్కరణల్లో యువత పాత్ర కీలకమని చెప్పారు. యువత సమస్యల పరిష్కారం కోసం సెమినార్లు, వర్క్‌షాపులను నిర్వహించాలని సూచించారు. ప్రిన్సిపల్ టీవీ రావు, ఏఓ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తా



మహమ్మద్ హుస్సేన్

వరికుంటపాడు: స్థానిక తహసీల్దార్‌గా మహమ్మద్ హుస్సేన్ బాధ్యతలను సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సమస్యలను ప్రజలు నేరుగా తనకు తెలియజేయొచ్చని తెలిపారు. కాగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వర్తిస్తూ బదిలీల్లో భాగంగా ఇక్కడ తహసీల్దార్‌గా ఈయన నియమితులయ్యారు.